ఉపాధి కష్టాలు


అడవిదేవులపల్లిలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు

- పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు వసతులు కరువు
- అందుబాటులో లేని తాగునీరు, మెడికల్ కిట్లు
- వేసవి కావడంతో ఇబ్బందులు పడుతున్న కూలీలు

అడవిదేవులపల్లి: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలకు పనులు చేసే స్థలంలో కనీస వసతులు కరువయ్యాయి. పని ప్రదేశాల్లో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సరైన వసతులు కల్పించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడవిదేవులపల్లి మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారులు 6150 జాబ్‌కార్డులను జారీ చేశారు. ప్రస్తుతం రోజువారీ కూలీలు 3500 మంది వరకు పనులకు హాజరవుతున్నారు. గతేడాది నుంచి నూతన విధానం (నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్) అమలులోకి రావడంతో కూలీలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పని చేస్తున్నారు. పని ప్రదేశం వద్ద కూలీలు పని చేసే ఫొటోలను అప్‌లోడ్ చేసిన తరువాత కూలీలు ఇంటిబాట పట్టాల్సి ఉంటుంది.

ఇంటి నుంచి మంచినీరు

ఉపాధి కూలీలకు గతంలో పనులు చేసే ప్రదేశం వద్ద గుడారాలు, మంచినీటి వసతి, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచే వారు. కానీ ఇప్పుడు కూలీలే ఇంటి నుంచి మంచినీరు, మెడికల్ కిట్లు తదితర వాటిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభమై ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఎలాంటి వసతులు లేకపోవడంతో కూలీలు ఇంటి వద్ద నుంచి తీసుకెళ్లిన మంచినీటి బాటిళ్లే దిక్కవుతున్నాయి. గతంలో వేసవిలో కూలీలు మంచినీటిని తెచ్చుకుంటే వారికి మూడు నెలల పాటు రూ.5 మేరకు అలవెన్స్ చెల్లించేవారు. కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చిన తరువాత వాటి ఊసే లేకుండా పోయింది. కూలీలు పనులను ముగించుకొని కాసేపు చెట్టు నీడన సేద తీర్చుకునేందుకు గ్రీన్ షెడ్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఎండకు నీరసించి వడదెబ్బ తగిలిన వారికి తాగించేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచడం లేదు. అదే విధంగా ఉపాధి కూలీలకు ఏళ్లుగా పార, గడ్డపార, తట్టలు వంటివి అందించడం లేదు. ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో కూలీలు ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోతున్నారు.

మంచినీటి వసతి కూడా లేదు



ఉపాధి హామీ పనులు చేసే చోట ఎలాంటి వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కనీసం మంచినీటి వసతి కూడా కల్పించడం లేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలో పని చేసి సేద తీర్చుకునేందుకు చెట్ల కిందకు వెళ్తున్నాం. పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు వంటి తదితర వస్తువులను కూడా అందించడం లేదు.

– బండి పాపయ్య, అడవిదేవులపల్లి

అన్ని వసతులు కల్పిస్తాం



అడవిదేవులపల్లి మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రధానంగా మంచినీటి వసతి, సేద తీర్చుకునేందుకు పాకలను ఏర్పాటు చేస్తాం. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాం.

– రమేష్, ఎంపీడీఓ, అడవిదేవులపల్లి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ అర్బన్: మండలంలోని వెంకటాద్రిపాలెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తుండడంతో వెంకటాద్రిపాలెం, ఇండస్ట్రియల్ ఏరియా, శ్రీనివాసనగర్, దుబ్బతండా, తుంగపాడు, నల్లగట్టుతండా, లావుడితండా, సామ్యగానితండా, టీక్యాతండా, కేశవనగర్, కొత్తూరు, భగ్యాగోపసముద్రంతండాలో గురువారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ అమర్‌సింగ్ బుధవారం తెలిపారు. నందిపాడు సబ్‌స్టేషన్‌కు వచ్చే 33కేవీ లైన్‌లో ఉన్న చెట్లు తొలగింపులో భాగంగా నందిపాడు, ఐలాపురం, చిల్లాపురం, ట్యాంక్‌తండా, కొక్యతండా, మైసమ్మకుంటతండా గ్రామాలకు కూడా ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


రాగ్యానాయక్

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి మండల తహసీల్దార్‌గా రాగ్యానాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిట్యాల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న రాగ్యానాయక్ పదోన్నతిపై తహసీల్దార్‌గా బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దు


షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

నాగార్జునసాగర్: ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దని దుకాణాల యజమానులకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మున్సిపల్ అధికారులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే రూ.వేయి నుంచి రూ.5వేల వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో బాలాజీ, శివకృష్ణ పాల్గొన్నారు.

వేసవి శిబిరం ప్రారంభం


శిక్షణ శిబిరంలో చిన్నారులు, నాయకులు

మిర్యాలగూడ: ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఎన్‌వీఆర్ యూత్ నాయకులు వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఇతర క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. యువత మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండడానికి సమ్మర్ క్యాంప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి, రవినాయక్, వెంకటేశ్వర్లు, అజోత్ అశోక్, నాగరాజు, అశోక్, కృష్ణకాంత్, వెంకన్న, జగన్ నాయక్, వడ్డె రాజు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లు గౌతంరెడ్డి అన్నారు. ఈ నెల 20న చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానికంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తిరుపతి రామ్మూర్తి, గుణగంటి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్

మాడ్గులపల్లి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పీఏ మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోరెడ్డి వెంకట్‌రెడ్డి మాతృమూర్తి రంగమ్మ ఇటీవల మృతిచెందారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ బుధవారం గ్రామానికి చేరుకుని రంగమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట తహసీల్దార్ సురేష్, ఇన్‌చార్జి ఆర్‌ఐ నాగయ్య తదితరులున్నారు.

ఇందుగుల చెరువు పరిశీలన


చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్

మాడ్గులపల్లి: మండలంలోని ఇందుగుల గ్రామంలో చెరువు కబ్జాకు గురికాకుండా చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు. ఇటీవల గ్రామానికి చెందిన పలువురు రైతులు చెరువు కబ్జాకు గురవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో చెరువు కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు తహసీల్దార్ బుధవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. సర్వేయర్లతో చెరువుకు హద్దులు నిర్ణయించి కబ్జాకు గురికాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్‌ఐ నాగయ్య, ఇరిగేషన్ అధికారులున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నల్లగొండ టౌన్: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండ పట్టణలంటని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు కట్టు బానిసలుగా తయారు చేయాలని చూస్తోందని ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కేవీస్ రెడ్డి, లెనిన్, గుండె రవి, ఎండీ జానీ, టి.సత్యనారాయణ, మహేష్, జి.నరేందర్, చింత భిక్షం, అశోక్, అక్కలయ్య పాల్గొన్నారు.

ఉత్తమ పోలీస్ అధికారిగా హనుమానాయక్



హనుమానాయక్‌కు రివార్డు అందజేస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నిడమనూరు : మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఉత్తమ గ్రామ పోలీస్ అధికారిగా నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హనుమానాయక్ ఎంపికయ్యారు. మండలంలోని వెంకటాపురం గ్రామ పోలీస్ అధికారిగా ఉత్తమ సేవలందించినందుకు బుధవారం ఆయన ఎస్పీ శరత్ చంద్ర పవార్ నుంచి రూ.3 వేల రివార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా హనుమ నాయక్‌కు ఎస్‌ఐ ఉప్పు సురేష్, ఏఎస్‌ఐ జోజి అభినందనలు తెలిపారు.

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి

దేవరకొండ: అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నరసింహ మాట్లాడుతూ.. గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తలు, నాయకులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండలాధ్యక్షుడు నేనావత్ రామునాయక్, అంజన్న, చందేశ్వర్, రెడ్డి శేఖర్, రవి, అంజి, రవీందర్ తదితరులున్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని అన్నారం గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


ధాన్యం పరిశీలిస్తున్న రవీంద్రకుమార్

డిండి: కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. బుధవారం డిండి మండల కేంద్రంతోపాటు మండలంలోని తవక్లాపూర్, టి.గౌరారం, గోనబోయనపల్లి గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లారీల కొరతతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి వడ్లు తడిసిపోయి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆయన వెంట ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఆర్‌వీఆర్, డిండి పట్టణ అధ్యక్షుడు గిరమోని శ్రీను, గుర్రం సురేష్, బల్మూల తిర్పతయ్య, రోీదు, పీర్ మహ్మద్, శ్రీనివాసరావు, రాఘవాచారి, జనార్దన్ రావు తదితరులున్నారు.

జెర్సీల పంపిణీ


జెర్సీలు అందజేస్తున్న మాజీ ఎంపీపీ రేఖా శ్రీధర్‌రెడ్డి

కొండమల్లేపల్లి : కాంగ్రెస్ పార్టీ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు ఉట్కూరు వేమన్‌రెడ్డి ఆర్థికసాయంతో రూ.15వేలు వెచ్చించి సమకూర్చిన కబడ్డీ జెర్సీలను మాజీ ఎంపీపీ రేఖా శ్రీధర్‌రెడ్డి బుధవారం క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంగ్యానాయక్, సురేష్, ఈదయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఊయల సెంటర్ ఏర్పాటు


ఊయల సెంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

దేవరకొండ: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఊయల (క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్)ను ఏర్పాటు చేశారు. ఏఎస్పీ మౌనిక మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు భారంగా భావించిన శిశువుల సంరక్షణకే ఊయల సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రకాష్, సీడీపీఓ చంద్రకళ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ చింతకృష్ణ, శిశుగృహ మేనేజర్ దుర్గా భవాని పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు


మాట్లాడుతున్న ఏఓ మాధవరెడ్డి

గుర్రంపోడు : రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, లేకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి అన్నారు. బుధవారం గుర్రంపోడు మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తనాలు, ఎరువుల స్టాక్ వివరాలు ప్రతి రోజు నోటీస్‌బోర్డుపై పొందుపర్చాలన్నారు. నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ: దేశవ్యాప్తంగా ఈనెల 20 నుంచి నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు పాపానాయక్ కోరారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో దామరచర్ల సీఐటీయూ మండల కార్యదర్శి భైరం దయానంద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బాషా, బాలునాయక్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నాయకులు

ఖాళీగా కీలక పోస్టులు!

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇన్‌చార్జీలతోనే కొనసాగుతున్న పనులు


మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, అకౌంట్ సెక్షన్లతో పాటు పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మున్సిపల్ మేనేజర్ ప్రధాన పోస్టు గత ఐదారేళ్లుగా ఖాళీగా ఉంది. పట్టణ ప్రణాళిక విభాగంలో నాలుగు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ల పోస్టులకు గాను మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీపీబీఓ నాలుగు పోస్టులకు గాను రెండు పోస్టులు, శానిటరీ జవాన్లు 7 పోస్టులకు గాను మూడు పోస్టులు, ఎలక్ట్రీషియన్ ఒకటి, పర్యావరణ ఇంజనీర్ ఒకటి, బిల్లు కలెక్టర్లు ఆరుగురికి గాను నాలుగు పోస్టులు, టెక్నికల్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, డ్రాఫ్ట్‌మన్, బర్త్ అండ్ డెత్ సూపర్‌వైజర్, వార్డు ఆఫీసర్లు 29, పబ్లిక్ హెల్త్ వర్కర్లు 10 పోస్టుల చొప్పున ఖాళీగా ఉన్నాయి. దీంతో మున్సిపాలిటీలో చాలా పనులు నిలిచిపోతున్నాయని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

సర్వేలకే పరిమితమైన వార్డు ఆఫీసర్లు

మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు వచ్చిన నాటి నుంచి వివిధ సర్వేలకు పంపిస్తుండడంతో వారికి ఆ వార్డులపై పూర్తి స్థాయిలో అవగాహన లేకుండా పోయింది. కమిషనర్ ఇచ్చే ఆదేశాలను వార్డు ఆఫీసర్‌గా ఆ వార్డుల్లో పని చేయించాల్సి ఉంటుంది. కానీ వారిని ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆస్తి పన్నుల వసూళ్లు, ఎల్‌ఆర్ఎస్ తదితర సర్వేలకు పంపిస్తున్నారు.

వారంలో మూడు రోజులే..

మిర్యాలగూడ మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ప్రధాన పోస్టుల అధికారులు ఇతర మున్సిపాలిటీలో ఇన్‌చార్జీలుగా పనిచేస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీఓ సోమయ్య సూర్యాపేట, నందికొండ మున్సిపాలిటీలకు ఇన్‌చార్జీ కాగా టీపీఎస్‌గా పని చేస్తున్న అంజయ్య నకిరేకల్ మున్సిపాలిటీతో పాటు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీకి ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. అకౌంటెండ్‌గా పని చేస్తున్న కల్ప న చిట్యాల మున్సిపాలిటీలో ఇన్‌చార్జీగా పని చేస్తున్నారు. జేఏఓగా పని చేస్తున్న ధనుంజయ తిరుమలగిరి మున్సిపాలిటీలో ఇన్‌చార్జీగా పని చేస్తున్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీను కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్లడంతో ప్రస్తుతం ఈ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. మున్సిపాలిటీలో ఏఈ పోస్టు ఖాళీగా ఉండటంతో హుజూర్‌నగర్ ఏఈగా పని చేస్తున్న వినోద్‌ను ఇన్‌చార్జీగా నియమించారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి


మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు

నిడమనూరు : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగవుతున్నాయని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. బుధవారం సోమవారిగూడెంలో మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాంగ్రెస్ నాయకులు ఎడవెల్లి వల్లభరెడ్డి, మేరెడ్డి వెంకట్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, విద్యుత్, వంటి మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయన్నారు. ఇటీవల ఉపాధిహామీ, ఎస్‌డీఎఫ్ నిధులతో మండలంలో రూ.కోటికిపైగా సీసీ రహదారులు నిర్మించామన్నారు. ఎర్రబెల్లి, తుమ్మడం గ్రామాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి సహకారంతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చెర్క శ్రీను, కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, నర్సింగ్ విజయ్‌కుమార్, ఎడవెల్లి జైపాల్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): హాలియాలో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించే టీఆర్జీఎస్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని తిరుమలగిరి(సాగర్) మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్ కోరారు. బుధవారం మండలంలోని రంగుండ్ల తండాలో శిక్షణ తరగతుల కరపత్రాలను ఆయన సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. గిరిజనుల సంస్కృతిని పరిరక్షించుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు గిరిజనులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఆర్జీఎస్ సంఘం నాయకులు కొర్ర శంకర్ నాయక్, జవహర్‌నాయక్, నరేష్‌నాయక్, భాస్కర్ నాయక్, లాలు, రమేష్, బాబురావు, అశోక్, ముని, మంగ్తా, దేవేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యనే మురుగు


తోపుచర్లలో ఇళ్ల మధ్యన నిలిచిన మురుగునీరు

- తోపుచర్లలో మురుగుకాల్వలు అస్తవ్యస్తం
- విజృంభిస్తున్న దోమలు

మాడ్గులపల్లి: మండలంలోని తోపుచర్ల గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలుస్తోంది. మురుగుకాల్వలు తీయకపోవడంతో కాల్వలో నీరు రోడ్లపై నిలుస్తోంది. దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇళ్లలోని నీటితోపాటు వర్షపు నీరు కూడా చేరడంతో దుర్వాసన వస్తోంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు.

ఫాగింగ్ చేపట్టాలి



గ్రామంలో మురుగు కాల్వల పరిస్థితి అధ్వానంగా మారింది. రోడ్లపై మురుగునీరు నిలుస్తోంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. దోమలతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి గ్రామంలో ఫాగింగ్ చేపట్టాలి.

– కేసారి వెంకన్న, తోపుచర్ల

విగ్రహ ప్రతిష్ఠాపనకు వేళాయే..

- ముస్తాబైన సీతారామాంజనేయస్వామి ఆలయం
- రేపటి నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు

హాలియా : అనుముల మండలంలోని చల్మారెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు శ్రీసీతారామాంజనేయ, లక్ష్మణ, గణపతి, శివ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మశ్రీ కాటేపల్లి రామలింగేశ్వర శర్మ, ఆలయ పూజారి బ్రహ్మశ్రీ కాటేపల్లి రమేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. శుక్రవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, రక్షా బంధనం, దీక్షా ధారణ, యాగశాల ప్రవేశం, శనివారం యంత్రాలు, విగ్రహాలకు పంచామృత నివేదన, సుగంధ పూజలు, హోమాలు, ఆదివారం గర్తన్యాసం, బీజన్యాసం, ధ్వజస్తంభం, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.


చల్మారెడ్డిగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాంజనేయ ఆలయం